నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 22 నవంబర్ 2024 | HYDERABAD

డీసీఏ దాడులు.. ఔషధాలు సీజ్

సిటీబ్యూరో, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలు విక్రయిస్తున్న పలు మెడికల్ షాప్‌లు, క్లినిక్‌లపై డీసీఏ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరిపారు. పలు ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ గ్రామంలో ఓ క్లినిక్‌లో 76 ఔషధాలను, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఫెర్రోర్డ్-ఎక్స్‌టీ మాత్రలను సీజ్ చేశారు. నగరంలోని రాజేంద్రనగర్‌లో పలు మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా పలు రకాల ఔషధాలపై ప్రకటనలు ముద్రించి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో డీసీఏ అధికారులు పలు ఆయుర్వేద మెడికల్ షాపులపై దాడులు జరిపారు. గుండె, కిడ్నీ, బీపీ, షుగర్ తదితర వ్యాధుల పేరుతో కూడిన లేబుళ్లు ముద్రించిన మందులను సీజ్ చేశారు.

ఆరు పదుల వయసులో..

ఆరు పదుల వయసులో ఇటీవల బ్యాంకాక్‌లో నిర్వహించిన మిసెస్ ఏసియా ఇంటర్నేషనల్ క్లాసిక్ టైటిల్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ విజయ శారదా రెడ్డిని గురువారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ శారదారెడ్డి మాట్లాడుతూ వయస్సు అనేది మనసుకే తప్ప.. శరీరానికి కాదనే విషయాన్ని చాటి చెప్పేందుకే ఇటీవల బ్యాంకాక్‌లో జరిగిన ఏసియా ఇంటర్నేషనల్ క్లాసిక్ టైటిల్ పోటీల్లో పాల్గొని విజయం సాధించానని చెప్పారు. **-బంజారాహిల్స్**

ఇచ్చుకో.. కట్టుకో!

- అయ్యప్ప సొసైటీలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- సుప్రీంకోర్టు స్టేటస్ కో ఆదేశాలు బేఖాతరు
- బడా నేతలు, అధికారుల అండతో కట్టడాలు
- ఫ్లోర్‌కు రేటు ఫిక్స్ చేసి మరీ.. ప్రోత్సాహం

గడిచిన కొన్ని నెలలుగా కనిపించని టౌన్ ప్లానింగ్, టాస్క్‌ఫోర్స్

సిద్ధిఖ్‌నగర్ ఘటన నేపథ్యంలో దడపుట్టిస్తున్న అక్రమ కట్టడాలు

మాదాపూర్ వంద ఫీట్ల రోడ్‌లో నిర్మాణంలో ఉన్న భవనం

సిటీబ్యూరో/మాదాపూర్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలోని కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి పునాదులపై పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలు ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఏ భవనం నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన ఇప్పుడు జనాల్లో నెలకొన్నది. ఇందుకు ఇటీవల కాలంలో పుప్పాలగూడ గోల్డెన్ ఓరియల్ అపార్ట్‌మెంట్‌లో సిలిండర్ పేలి అగ్ని ప్రమాద ఘటన, సిద్ధిక్‌నగర్‌లో ఒరిగిన నాలుగు అంతస్తుల నిర్మాణమే ఇందుకు నిదర్శనం. ఈ జాబితాలో మాదాపూర్ అయ్యప్ప సొసైటీ చేరనున్నదా? ప్రమాదాల అంచుల్లో ఉన్నామంటూ స్థానికుల్లో ఆందోళన మొదలైందా? అంటే అవుననే చెబుతున్నారు. జీరో పర్మిషన్ల పేరిట అక్రమ దందాలో పుట్టుకొచ్చిన అక్రమ కట్టడాలు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి కట్టినవే. గడిచిన కొన్ని నెలలుగా ఒకటి కాదు రెండు కాదు వందల సంఖ్యలో వెలిసిన అక్రమ భవన నిర్మాణాల్లో చాలా వరకు ఎలాంటి సెట్ బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలకు నీళ్లొదిలారు. అడ్డగోలుగా సెల్లార్ తవ్వకాలు చేపట్టారు. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో అయ్యప్ప సొసైటీ ఉండటం...హాస్టళ్లు, హోటళ్లు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, కాలేజీలు ఇతర వాణిజ్య వ్యాపారాలకు డిమాండ్ దృష్ట్యా ఈ ప్రాంతంలో నిర్మాణాలకు డిమాండ్ ఏర్పడింది.

అడిగింది ఇస్తే..

అయప్ప సొసైటీలో 200 గజాల నుంచి వెయ్యి గజాల విస్తీర్ణంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరుగుతున్నది. అయ్యప్ప సొసైటీలో అనధికారికంగా నిర్మాణాలకు వెలకట్టి మరీ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు కప్పం వసూలు చేస్తున్నట్లు బహిరంగ విమర్శ. ఇక్కడ జరిగే అక్రమ నిర్మాణాలకు స్థలం, విస్తీర్ణాన్ని బట్టి రేటు ఫిక్స్ చేస్తున్నారు. ఫ్లోర్‌కు రూ.1.50 లక్షల నుంచి రెండు లక్షల మేర వసూలు చేస్తున్నట్లు అరోపణలు ఉన్నాయి. కప్పం కట్టిన భవనం జోలికి ఏ అధికారి వెళ్లరు అన్న చర్చ లేకపోలేదు. గడిచిన కొన్ని నెలలుగా విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. ఈ దందా వెనుక అధికారంలో ఉన్న కొందరు పెద్దలతో పాటు స్థానిక అధికారులు హస్తం ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందాలు పనిచేయడం లేదు. దీంతో గురుకుల్ ట్రస్ట్ భూములున్న అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా లే అవుట్‌లో ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. గురుకుల్ ట్రస్ట్ భూములపై న్యాయస్థానం స్టేటస్‌కో ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అంతేకాదు వీటికి రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోతున్నాయి. జలమండలి అధికారులు నల్లా కనెక్షన్లు, విద్యుత్ అధికారులు కూడా కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు.

వివాదాస్పద భూముల్లో పర్మిషన్లు?

ఖానామెట్‌లో గురుకుల్ ట్రస్ట్‌కు 625 ఎకరాలు ఉన్నాయి. బన్సీలాల్ అనే దాత సామాజిక కార్యక్రమాలకు, పేద విద్యార్థుల చదువుల కోసం ఈ భూములను దానంగా ఇచ్చారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ ట్రస్ట్ ఆధీనంలో ఈ భూములు ఉండేవి. ఈ స్థలాన్ని అప్పట్లో ట్రస్ట్ సభ్యులు కొందరు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించారు. అయ్యప్ప సొసైటీ కూడా 125 ఎకరాల్లో ఏర్పడింది. ఇందులో 1200 ప్లాట్లను ఉద్యోగులు , మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు కొనుగోలు చేశారు. అవి సీలింగ్ భూములని, అమ్మకాలు చెల్లవని అప్పట్లో ప్రభుత్వం నిర్మాణాలను అడ్డుకున్నది. ఈ భూముల క్రమబద్ధీకరణకు దేవాదాయ శాఖ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ భూములపై ప్రభుత్వానికి , ట్రస్ట్‌కు, సొసైటీలకు మధ్య సుప్రీంకోర్టులో వివాదం నడిచింది. సుప్రీంకోర్టులో ఉన్న ఈ వివాదం పరిష్కారం అయ్యే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు ఆదేశించింది. కానీ వందల సంఖ్యలో అక్రమ కట్టడాలు కుప్పలు, తెప్పలుగా వెలుస్తున్నాయి.

పనితీరులో మార్పేదీ?

హెచ్ఎండీఏలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

అన్ని విభాగాల్లోనూ అలసత్వమే

సిటీబ్యూరో: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు లేవు. ఇదే హెచ్ఎండీఏ పరిధిలో పాలన పడకేసేలా చేస్తోంది. ఉన్నతాధికారులే విధులకు దూరంగా ఉండటంతో.. సిబ్బంది పనితీరు సాధారణ జనాలను ముప్పు తిప్పలు పెడుతున్నది. ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలో కొన్ని విభాగాల్లో ఆలసత్వం ఖజానాకు గండి కొడుతుందనే విమర్శలు ఉన్నాయి. ఇక ఆదాయ వనరులను పెంచడంలోనూ కొన్ని విభాగాల ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో హెచ్ఎండీఏలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. హెచ్ఎండీఏకు పూర్తి స్థాయి కమిషనర్ ఇచ్చినా.. పనితీరులో ఎలాంటి మార్పు లేదు. భవన నిర్మాణాల అనుమతులను వేగంగా చేస్తున్నామని చెబుతున్నా.. ఆన్‌లైన్ సమస్యల కారణంగా కార్యాలయానికి వచ్చిపోయే జనాల సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. అనుమతులతో ఆదాయం సమకూరుతుందని తెలిసినా.. నెలకొన్న జాప్యం అటు దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంది. అలాగే కొత్వాల్‌గూడ ఏకో పార్క్ నిర్మాణ పనులు నెమ్మదించాయి.

షాడో నేతల ప్రమేయంలోనూ..

ఇటీవల కాలంలో భవన నిర్మాణ అనుమతుల విషయంలో షాడో నేతల ప్రమేయంలోనూ కొంత మంది అధికారుల ప్రోత్సాహం ఉందనే విమర్శలు ఉన్నాయి. కనీసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా ఉన్నతాధికారులు సమీక్షించడం లేదని తేలింది. ఈ క్రమంలో బుద్ధపౌర్ణమి ప్రాజెక్టులో పార్కింగ్ కాంట్రాక్టుల అవకతవకలకు కారణమైందని తెలిసింది. అదే తరహాలో అర్బన్ ఫారెస్ట్రీలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా మారినట్లుగా తెలుస్తోంది. టెండర్ల ఖరారు నుంచి పనులు అప్పగించేంత వరకు కొందరు ఉన్నతాధికారుల కదలికలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటిదే ట్యాంక్ బండ్ పరిసరాల్లో జరిగిన పార్కింగ్ అవకతవకలకు తెరతీసినట్లుగా సమాచారం. ప్రస్తుతం ఈ విషయంపై వచ్చిన ఆరోపణలతో పార్కింగ్ కాంట్రాక్ట్‌ను చక్కదిద్దినా... ఇలాంటివేన్నో వ్యవహారాల్లో కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని తెలిసింది. వీటిపై సహోద్యోగులే బాహాటంగానే ఆరోపణలు చేస్తుండగా.. ఇక డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారుల పెత్తనం విస్తరించినట్లు ఉద్యోగులు వాపోతున్నారు.

నగరంలో చలి పులి

సిటీబ్యూరో: నగరంలో చలి వణుకు పుట్టిస్తోంది. మొన్నటి వరకు 20 డిగ్రీలకు పైగా నమోదైన రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 15కు పడిపోవడంతో చలి విజృంభిస్తున్నది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 29.4, కనిష్ఠం 15.7 డిగ్రీలు, గాలిలో తేమ 46శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

హైడ్రాకు 100కుపైగా ఫిర్యాదులు

కూల్చివేతలు కొనసాగేనా?.. క్షేత్రస్థాయిలో పరిశీలనకు ప్రత్యేక బృందాలు

సిటీబ్యూరో: మళ్లీ హైడ్రా కూల్చివేతలు స్పీడందుకున్నట్లేనా..! అంటే అవుననే చెబుతున్నారు అధికారులు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలంటూ తమ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులపై దృష్టి పెట్టిన హైడ్రా.. ఆయా ప్రాంతాల్లో సంబంధిత శాఖల రిపోర్టుల ఆధారంగా కూల్చివేతలను కొనసాగించనున్నది. ఓఆర్ఆర్ లోపల చాలా ప్రాంతాల్లో రోడ్లు, పార్కులు కబ్జా చేశారంటూ.. కాలనీల నుంచి వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా బృందాలు వేర్వేరుగా స్థానిక అధికారులతో కలిసి కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకున్నాయి. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లాతో పాటు ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల కూల్చివేతలు చేసిన హైడ్రా.. ఈ రెండుమూడురోజుల్లో మరికొన్ని ప్రాంతాల్లో కూల్చివేతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హైడ్రా బృందం రెవెన్యూ, ఇరిగేషన్, లీగల్ టీంలతో కలిసి తమ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నది. ఇందులో ఎక్కడ సులువుగా పని జరుగుతుందో, న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా ఎక్కడ ఉంటాయో చూసుకొని.. అక్కడ తమ బృందాలతో చర్యలకు సిద్ధమవుతున్నది. ఈ నెల రోజుల్లో హైడ్రా కార్యాలయానికి వందకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. ప్రధానంగా పలు కాలనీల్లో నాలాలు, పార్కులు, రోడ్ల ఆక్రమణలపై కాలనీలు, స్థానికుల నుంచి ఈ ఫిర్యాదులొచ్చాయి. అయితే అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పటేల్‌గూడలో హైడ్రా కూల్చివేతలపై భూ యజమానులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు సర్వేకు ఆదేశించి తదుపరి చర్యల వరకు స్టేటస్ కో విధించింది. కోర్టు వివాదాల నేపథ్యంలో తమ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ లీగల్ టీంతో సమీక్షించారు. ఫిర్యాదుల్లో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు వచ్చే న్యాయపరమైన చిక్కులపై చర్చించారు.

ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన

హైడ్రా కార్యాలయానికి గత నెల వరకు వర్షాల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులపై వచ్చిన ఫిర్యాదులే ఎక్కువగా రాగా ఈ నెల రోజుల నుంచి మాత్రం పార్కులు, నాలాలు, రోడ్ల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులే వచ్చినట్లు హైడ్రా అధికారి చెప్పారు. వీటిపై సంబంధిత శాఖల నుంచి హైడ్రా కమిషనర్ ప్రాథమిక నివేదిక కోరారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు సంబంధించి స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి నివేదిక తీసుకున్న తర్వాత వాటిపై చర్యలకు దిగనున్నట్లు తెలిసింది.

ఔటర్ లోపల...

ఓఆర్ఆర్ లోపల జీహెచ్ఎంసీతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామపంచాయతీలు హైడ్రా పరిధిలోకి వస్తాయి. వీటిలో హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోనే ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న పార్కులు, రోడ్ల స్థలాల ఆక్రమణలపై వచ్చిన వాటిపై హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించింది. ఆక్రమణలు చేసిన వారికి నోటీసులు కూడా ఇచ్చామని వారి నుంచి వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో రెండోసారి కూడా నోటీసులను జారీ చేసినట్లు హైడ్రా అధికారులు చెప్పారు. ఇప్పటి వరకు కార్యాలయానికి వచ్చిన వందకు పైగా ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిశీలించి అందులో ఆక్రమణదారులుగా పేర్కొంటున్న 40 మందికి నోటీసులు ఇచ్చారు. వారికిచ్చిన గడువు ముగిసిన తర్వాత వారి వివరణను బట్టి చర్యలకు దిగడానికి హైడ్రా సిద్ధమవుతున్నది. అయితే చాలాచోట్ల కోర్టు వివాదాలకు సంబంధించిన భూములపై కూడా ఫిర్యాదులు రావడంతో వాటిపై లీగల్ టీం సలహా మేరకు ముందుకు వెళ్లనున్నారు. రెవెన్యూ, మున్సిపల్ రికార్డులను అనుసరించి ఆక్రమణలుగా తేల్చిన వాటిని తొలగించేందుకు హైడ్రా రెడీ అయింది.

సర్వే తెచ్చిన తిప్పలు

ధ్రువీకరణ పత్రాల జారీలో కాలయాపన

విద్యార్థులకు అవస్థలు

మేడ్చల్: కులగణన సర్వేలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొంటున్న క్రమంలో కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పై చదువులతో పాటు పోటీ పరీక్షల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో సకాలంలో విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందడం లేదన్న విమర్శలొస్తున్నాయి. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవలో చేసుకున్న దరఖాస్తుపత్రాలకు సంబంధించిన రసీదులతో మేడ్చల్ జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం లేకుండా పోతున్నది. కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో ధ్రువీకరణ పత్రాలు అందక తిరిగి వెళ్లిపోవాల్సి వస్తున్నదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరం ఉన్న కుల, ఆదాయ ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది కులగణన సర్వే పేరిట ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలో కాలయాపన చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

పాఠశాలకని చెప్పి..

సూర్యలంక బీచ్‌కు

కూకట్‌పల్లికి చెందిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం

- గుండెలు బాదుకున్న తల్లిదండ్రులు
- చీరాలలో ఆచూకీ తెలియడంతో ఊపిరిపీల్చుకున్న కుటుంబసభ్యులు

మూసాపేట: ఇద్దరు విద్యార్థినులు బడికి పోకుండా చీరాలలోని సూర్యలంక బీచ్‌కు వెళ్లి.. రెండ్రోజుల పాటు తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేశారు. తీరా ఆచూకీ దొరికాక ఇటు తల్లిదండ్రులు, అటు పోలీసులు ఊపిరి పీల్చుకోవడంతో కథ సుఖాంతమైంది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ముత్తు తెలిపిన వివరాల ప్రకారం....బాలజీనగర్, ఆల్విన్‌కాలనీలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు(13) వివేకానందనగర్ చైతన్య టెక్నో పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. రోజూలాగే బాలికల తల్లిదండ్రులు బుధవారం ఉదయం స్కూల్‌లో వదిలి వెళ్లారు. ఇంటికి తీసుకెళ్లామని సాయంత్రం పాఠశాలకు చేరుకోగా, తమ కూతుళ్లు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. ఎంత వెతికినా లాభం లేకపోవడంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఇద్దరు బాలికలను వెతికే క్రమంలో పోలీసులు సీసీ కెమెరాలను జల్లెడ పట్టగా.. చిత్తారమ్మ ఆలయ సమీపంలో నిర్మాణంలో ఓ భవనంలో విద్యార్థినులు తమ స్కూల్ యూనిఫాంను వదిలి తమతో తెచ్చుకున్న సివిల్ డ్రెస్ మార్చుకొని బయటికి వచ్చినట్టు వెల్లడైంది. పోలీసులు స్నేహితులను విచారించగా.. బాలికలిద్దరూ తరచుగా ఆంధ్రప్రదేశ్‌లోని చీరాలలో ఉన్న సూర్యలంక బీచ్‌కు వెళ్లాలని మాట్లాడేవారని తేలింది. పోలీసులు వెంటనే చీరాల పోలీసులను సంప్రదించి, విద్యార్థినుల ఆచూకీ కనుక్కొన్నారు. బాలికలు క్షేమంగా ఉన్నారని తెలుసుకొని కూకట్‌పల్లి పోలీసులు వారిని తీసుకురావడానికి బయలుదేరారు.

అనుమతుల్లేని భవనాలపై నజర్

సిద్ధిక్‌నగర్‌లో పట్టణ ప్రణాళిక విభాగం సర్వే

భవనం ఒరిగిన ఘటన నేపథ్యంలో చర్యలకు రంగం సిద్ధం

అయ్యప్ప సొసైటీలో 100 గజాల స్థలంలో అనుమతుల్లేకుండా కడుతున్న ఓ భవనం

మియాపూర్ : శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో ఓ అక్రమ నిర్మాణం ప్రభావంతో సమీపంలోని భవనం ఒరిగిన ఘటనతో పట్టణ ప్రణాళికా అధికారుల్లో కదలిక వచ్చింది. ఈ ఘటనతో ఓ భవనాన్ని నేలమట్టం చేయాల్సి రావడంతో ప్రజానీకం తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రధానంగా ఎటువంటి అనుమతుల్లేకుండా తక్కువ స్థలంలో ఎక్కువ మొత్తంలో అంతస్తులు నిర్మిస్తూ.. వాటిని నిబంధలకు విరుద్ధంగా హాస్టళ్లకు అద్దెకిస్తూ లక్షలాది రూపాయలను యజమానులు పోగేసుకుంటున్నారు. ఈ తరహా అక్రమ నిర్మాణాల్లో పరోక్షంగా అధికారులకు ముడుపులు అందుతుండటం వల్లే నోరు మెదపటం లేదన్న ఆరోపణలు సైతం వస్తున్నాయి. తాజా ఘటన నేపథ్యంలో సిద్ధిక్‌నగర్‌లో నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. వంద గజాల్లోనే ఏకంగా ఐదారుకు మించి అంతస్తులు నిర్మిస్తుండటం.. కొందరు సెల్లార్లు సైతం తవ్వుతుండటంతో సమీప నివాసాలకు పెను ప్రమాదంగా మారుతున్నది. రెండు రోజుల కిందట సిద్ధిక్‌నగర్‌లో ఇలా ఓ అక్రమ నిర్మాణం ప్రభావం కారణంగానే పక్కనే ఉన్న భవనం పక్కకు ఒరిగి ప్రమాదపు అంచుల దాకా వెళ్లింది. దీంతో సదరు భవనాన్ని అధికారులు భారీ యంత్రాల సాయంతో నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. అయితే సిద్ధిక్‌నగర్‌లో ఇలా కుప్పలు తెప్పలుగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు, వాటిని హాస్టళ్లకు అద్దెలికిచ్చి యజమానులు లక్షల్లో కిరాయిలు పొందుతున్నారు. దీంతో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలతో పాటు ఇప్పటికే పూర్తయి హాస్టళ్లు కొనసాగుతున్న భవనాల సర్వేను తాజాగా పట్టణ ప్రణాళికా విభాగం చేపట్టింది. నాలుగైదు బృందాలు సిద్ధిక్‌నగర్‌లో పర్యటిస్తూ భవనాల వివరాల నమోదును ఆరంభించాయి. సర్వే అనంతరం అనుమతుల్లేకుండా నిర్మించడంతో పాటు హాస్టళ్లు కొనసాగుతున్న భవనాలన్నింటినీ సీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. భవనం విస్తీర్ణం, అంతస్తులు, ఏ తరహా వినియోగంలో ఉన్నదనే వివరాలను సర్వేలో నమోదు చేస్తున్నారు. అవసరమైతే యజమానులపై కేసులు నమోదు చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

స్పందించారు.. కూల్చేశారు..

కుత్బుల్లాపూర్, నవంబర్ 21: పేట్ బషీరాబాద్ సర్వే నంబర్ 25/1 ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాన్ని కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. ఈ నెల 14న 'నమస్తే'లో 'అధికారం మనదైతే...అడ్డే ముంది' శీర్షిక పేరుతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గతంలో ఇదే సర్వేలో వెలసిన అక్రమ నిర్మాణాన్ని అధికారులు కూల్చివేశారు. అయితే కబ్జాదారుడు తిరిగి యథావిధిగా నిర్మాణాన్ని చేపట్టారు. ఇప్పుడు తిరిగి కూల్చివేశారే తప్ప.. ఆ స్థలాన్ని పరిరక్షించేందుకు అధికారులు శాశ్వత చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సమీపంలోనే ఉన్న మరో అక్రమ నిర్మాణం సర్వే నంబర్ 25/2లో వెలసిన అక్రమ నిర్మాణంపై అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం చర్చానీయాంశంగా మారింది. ఆర్ఐ విజయ్‌ని వివరణ కోరగా, లీగల్‌గా ముందుకెళ్లాల్సి ఉన్నదని, త్వరలోనే అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నమస్తే ఎఫెక్ట్

కోత్వాల్‌గూడ రెవెన్యూ పరిధిలోని బఫర్‌జోన్‌లో కొందరు అక్రమార్కులు ప్రహరీ నిర్మిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్ఐ కృష్ణ సిబ్బందితో ఆ గోడను కూల్చివేశారు. హిమాయత్‌సాగర్ బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేసినా ఊరుకునే బిలేదని ఆయన హెచ్చరించారు. -శంషాబాద్ రూరల్

అగర్‌మియాగూడలో ఆర్‌డీవో అనంతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మా భూములే దొరికాయా?

ఫోర్త్ సిటీకి వెళ్లేందుకు ఎన్నో మార్గాలున్నాయ్

బలవంతపు భూ సర్వే నిలిపివేయాలి • ఆర్డీవోకు రైతుల వినతి

కందుకూరు: బలవంతంగా తమ భూములను సర్వే చేయవద్దని, తక్షణమే నిలిపివేయాలని అధికారులను రైతులు వేడుకున్నారు. 'ఫోర్త్ సిటీకి రోడ్డును ఏర్పాటు చేయడానికి మా భూములు దొరికాయా' అంటూ అధికారులను ప్రశ్నించారు. రోడ్డు ఏర్పాటు చేయడానికి మండల పరిధిలోని రాచలూరు, గాజులబుర్జు తండా, అగర్‌మియాగూడలో 3 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. అగర్‌మియాగూడ గ్రామానికి సర్వే నిర్వహించేందుకు ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ గోపాల్, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐలు సీతారాం, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది రావడంతో రైతులు మండిపడ్డారు. తమను చర్చలకు రావాలని పిలిచి సర్వే చేస్తారా అంటూ ప్రశ్నించిన అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. తమకు భూమికి, భూమి ఇవ్వాలని పట్టుబట్టారు. ఫోర్త్ సిటీకి వెళ్లేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని, శ్రీశైలం, జాతీయ రహదారి కొత్తూరు వద్ద జంక్షన్ ఉన్నదని, నాగార్జునసాగర్ జాతీయ రహదారి, తిమ్మాపూరు నుంచి వెళ్లడానికి అనువుగా ఉందన్నారు. అక్కడి నుంచి రోడ్డు నిర్మిస్తే భూములు పోవని.. తమ భూములు లాక్కోవద్దని వేడుకున్నారు. అయినా అధికారులు సర్వే నిర్వహించారు. దీంతో రైతులు తమకు ఎకరాకు ఎంత పరిహారం అందజేస్తారని చెప్పకుండా సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతు బంధు, రైతు బీమా వర్తించే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. పచ్చని పొలాలను ఎలా గుంజుకుంటారని నిలదీశారు. ఆర్డీవో అనంతరెడ్డి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని సర్వేకు అడ్డు చెప్పడం సమంజసం కాదని రైతులకు సూచించారు.